సాక్షి
అనకాపల్లి
బుధవారం ı 14 ı జూన్ ı 2023



రక్త 'సాయానికి' మేమున్నాం

ఏఎంఏఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 'సాయానికి రూ.10 సేవా సంస్థ' ద్వారా విశేష సేవలందిస్తున్నారు. 8లో



కుట్టు శిక్షణకు గుర్తింపు

జాతీయ నైపుణ్య కేంద్రం గుర్తింపు పొందిన కుట్టు శిక్షణ కేంద్రం జారీ చేసే ధ్రువపత్రాలకు విలువ ఉంటుంది. 8లో

వాతావరణం

అనకాపల్లి టౌన్ : రాగల ఐదు రోజులు 35 నుంచి 36.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. గాలిలో తేమ 70 నుంచి 85 శాతం, గాలి గంటకు 7 నుంచి 9 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంటుందని తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక

15 నుంచి 20 వరకు మండల స్థాయి ఎంపిక పోటీలు

అనకాపల్లిటౌన్ : డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్, కడపలో 2023–24 సంవత్సరానికి గాను 4వ తరగతిలో 40 సీట్లు(బాలురు–20, బాలికలు–20), 5వ తరగతిలో 11 సీట్ల(బాలురు–7, బాలికలు–4)ను భర్తీ చేసేందుకు ఎంపిక పోటీల తేదీలను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు కె.ఆనందలక్ష్మి మంగళవారం తెలిపారు. మండల స్థాయి ఎంపిక ప్రక్రియ ఈ నెల 15 నుంచి 20 వరకూ మండల ప్రధాన కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో జరగనుందన్నారు. మండల స్థాయిలో ఎంపికైన వారిలో జిల్లా స్థాయి అర్హుల్ని ఎన్టీఆర్ క్రీడామైదానంలో 23న 4వ తరగతి, 24న 5వ తరగతి ప్రవేశాలకు ఎంపిక ప్రక్రియ జరగనుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి ఎంపిక ప్రక్రియ ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికైన వారు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి అర్హులన్నారు. వివరాలకు 7095742012 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 80 శాతంపైగా ఉత్తీర్ణత

ఆరిలోవ : ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. 80 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలు గత నెల 24న ప్రారంభమై జూన్ 1 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రథమ సంవత్సరం 49,105 మంది, ద్వితీయ సంవత్సరం 41,510 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగిసిన సుమారు 10 రోజులకే పేపరు మూల్యాంకనం పూర్తయింది. అనంతరం వీటి ఫలితాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి మంగళవారం విడుదల చేసింది. ఈ పరీక్షల ఫలితాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 80.26 శాతం (39,414 మంది) ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 80.67 శాతం(33,487 మంది) ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లా రాష్ట్రంలో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఐదో స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తొమ్మిదో స్థానంలో నిలిచింది.

ఇగ్నో ప్రవేశాలకు 30 చివరి తేదీ

ఎంవీపీకాలనీ (విశాఖ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 2023 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission.samasth.edu. in/ ను సందర్శించి ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి

- విద్యాప్రమాణాలు ఉన్నతంగా ఉండాలి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ప్రభుత్వ భవన నిర్మాణాలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

మునగపాక: తిమ్మరాజుపేట, నాగులాపల్లి గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సుడిగాలి పర్యటన చేశారు. తిమ్మరాజుపేటలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్‌ను ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్ పనులు ఎందుకు ఆగిపోయాయో తెలుసుకున్నారు. నాడు–నేడు ద్వారా భవన నిర్మాణ పనులు నాణ్యంగా జరగాలన్నారు. జగనన్న విద్యాకానుక కిట్‌లను ఆయన పరిశీలించారు. విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. అనంతరం నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుకలను పరిశీలించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీడీవో మన్మధరావు, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

హైలెస్సో... హైలెస్సా!

వేటకు సెలవిచ్చారు.. సముద్రం ఒడ్డున పడవలకు లంగరేశారు.. వలలను కుట్టుకొని, బోట్లను బాగు చేసుకొని గంగపుత్రులు రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వేటకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో భృతి సకాలంలో అందక కాలే కడుపులతో అవస్థ పడేవారు. ఇప్పుడు వైఎస్ జగన్ సర్కారు వేట నిషేధ కాలంలోనే మత్స్యకార భరోసా సొమ్ము అందించడంతో పిల్లా పాపలతో కులాసాగా కాలక్షేపం చేశారు. నిషేధ కాలం ముగియడంతో నేటి అర్ధరాత్రి నుంచీ మళ్లీ వేట ప్రారంభించనున్నారు.



వేటకు పోదాం చలో చలో

- ముగిసిన 61 రోజుల విరామం
- చేపల వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు
- గంగపుత్రుల్ని ఆదుకున్న మత్స్యకార భరోసా
- త్వరలో ఫిషింగ్ హార్బర్, ఫిష్ ల్యాండింగ్ జెట్టీల నిర్మాణం

అచ్యుతాపురం (అనకాపల్లి): సముద్ర గర్భంలో చేపలు గుడ్లు పెట్టే కాలంలో వాటిని ఎదగనిచ్చేందుకు వేటకు విరామం ఇస్తారు. 61 రోజులపాటు చేపలు పట్టకుండా మత్స్యకారులు నిగ్రహం పాటిస్తారు. ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి మొదలైన నిషేధ కాలం బుధవారం రాత్రి ముగియనుండడంతో గంగపుత్రులు వేటకు సమాయత్తమవుతున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల మత్స్యకార మహిళలు గంగమ్మకు పూజలు చేశారు. వేటకు వెళ్లే తమ పెనిమిటి, పిల్లలు క్షేమంగా తిరిగి రావాలని, మత్స్య సంపద పుష్కలంగా లభించి తమ బతుకు పండాలని వేడుకున్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తీరాన్ని ఆనుకొని ఉన్న ఆరు మండలాల పరిధిలో 31 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 12 వేల కుటుంబాలు కేవలం చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి బతుకుతున్నాయి.

మత్స్యకారులకు మంచి రోజులు

జిల్లాలోని మత్స్యకారులు త్వరలో మంచి రోజులు రానున్నాయి. వారి తలరాతను మార్చే భారీ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చనున్నాయి. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న మత్స్యసంపద మార్కెటింగ్‌కు సంబంధించి మరిన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్‌కు రూ.393 కోట్లు మంజూరు చేసింది. అదే విధంగా నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, దొండవాకల్లో ఫిష్ ల్యాండింగ్ జెట్టీలను ఏర్పాటు చేయనుంది. రాజయ్యపేటకు రూ.27 కోట్లు, దొండవాకకు రూ.25 కోట్లు మంజూరు చేసింది.

సకాలంలో మత్స్యకార భరోసా

వేట నిషేధ సమయంలో అందించే మత్స్యకార భృతి విషయంలో గత ప్రభుత్వాలు శ్రద్ధ చూపేవి కావు. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధం ముగిసి నెలలు గడిచినా భృతి అందేది కాదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కచ్చితంగా విరామ సమయంలోనే మత్స్యకార భరోసా సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో ఎలాంటి కష్టం లేకుండా కాలం గడచిపోతోంది. ఈ ఏడాది 11,116 మంది మత్స్యకారులకు భృతి అందించారు. గతేడాదితో పోలిస్తే 831 మందికి అధికంగా మత్స్యకార భృతి అందింది.



చేపల మూటను పట్టుకెళ్తున్న మత్స్యకారులు (ఫైల్)

మత్స్యకారులకు ప్రభుత్వం అండ...

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంది. ఈ ఏడాది జిల్లాలో 11,116 మందికి వేట నిషేధ సమయంలోనే వారి ఖాతాల్లోకి మత్స్యకార భరోసా జమ చేసింది. జిల్లాలో ఒక ఫిషింగ్ హార్బర్, రెండు ఫిష్ ల్యాండింగ్ జెట్టీలను నిర్మించనున్నారు. మత్స్యకారులకు మహర్దశ రానుంది. వేట సమయంలో ప్రకృతి వైపరీత్యాల పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి.

–లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

జగనన్న ఉండగా మాకేటి లోటు



రెండు నెలల విరామం ముగిసింది. గురువారం ఉదయం వేటకు బయలుదేరుతాం. వేట విరామ సమయంలో ప్రభుత్వం అందించిన పరిహారం ఎంతో మేలు చేసింది. ఫిషింగ్ హార్బర్ పూర్తయితే మా జీవితాల్లో వెలుగులు ఉంటాయి. జగనన్న ఉండగా మాకు ఏ లోటూ ఉండదు.

–గంగ్లళ్ల దేముదు, కొండపాలెం

పాడి రైతుకు తీపి కబురు

- జిల్లాలో ఐదోసారి పాల సేకరణ ధర పెంచిన అమూల్
- లీటర్‌పై ఆవుపాలకు రూ.1.15, గేదె పాలకు రూ.2.24 పెంపు
- ప్రస్తుతం ఆవు పాలు లీటరు రూ.43.61, గేదె పాలు రూ.89.76



పాలు పోస్తున్న మహిళా పాడి రైతులు

సాక్షి, అనకాపల్లి : పాడిరైతులకు అమూల్ మరోసారి తీపి కబురు అందించింది. లీటర్ ఆవు పాలపై రూ.1.15, గేదె పాలపై రూ.2.24 చొప్పున ధర పెంచింది. జగనన్న పాలవెల్లువలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ అమూల్ ఏడు సార్లు ధరలు పెంచింది. జిల్లాలో మాత్రం పాల సేకరణ ప్రారంభం నుంచి ఐదు సార్లు ధరలు పెరిగాయి. ఈ పథకం ప్రారంభంలో గేదె పాల ధర లీటర్ రూ.71.47, ఆవు పాలు రూ.34.20 ఉండేవి. ప్రస్తుతం లీటర్ గేదె పాలు రూ.89.76, ఆవు పాలు రూ.43.61గా ఉన్నాయి. పాల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందుకు ఎంపీడీవో, తహసీల్దార్ల నేతృత్వంలో మండలస్థాయి కమిటీలను ఏర్పాటుచేయనున్నారు.

డెయిరీలకు మరింత సహకారం

దళారులతో సంబంధం లేకుండా రైతుల ఖాతాల్లో నేరుగా ప్రతీ 15 రోజులకూ నగదు వేయడం జరుగుతోంది. 6 నెలల్లో 90 రోజుల పాటు పాలు పోసిన మహిళా పాడిరైతులతో కోఆపరేటివ్ సొసైటీ కింద మహిళా డెయిరీ సహకార సంఘాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి 88 మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేశారు. 6 నెలల పాటు పాలు పోసిన ప్రతి పాడి రైతుకు లీటర్‌కు రూ.0.50 చొప్పున రాయల్టీ ఇన్‌సెంటివ్ ప్రతి అక్టోబర్లో చెల్లిస్తున్నారు. పాలను సేకరిస్తున్న ఏఎంసీయూ సెక్రటరీలకు హ్యాండ్లింగ్ చార్జీలు లీటర్‌కి రూ.1 చొప్పున ప్రతీ నెలా సొసైటీ ఖాతాకు జమ చేస్తున్నారు. మహిళా డైరీ సహకార సంఘాల్లో పాలు పోసే రైతులకు ప్రోత్సాహంగా నాణ్యమైన దాణా, డీసీసీబీ ద్వారా 0.58 పైసల వడ్డీకి రుణాలు, పశువులకు భీమా అందిస్తున్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా జిల్లాలో రోజుకు సగటున 20 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది.

పాడి రైతుల శ్రేయస్సే లక్ష్యంగా..



ప్రభుత్వం చొరవతో అమూల్ ద్వారా పాల సేకరణ చేపట్టడం పాడి రైతులకు బాగా కలిసి వచ్చింది. అమూల్ రాక మునుపు పాల సేకరణ ధరలు పెరగక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ఇప్పుడు మూడేళ్ల వ్యవధిలో లీటర్ గేదె పాలపై రూ.11, ఆవు పాలపై రూ.10 వరకు పెరిగింది. జిల్లాలో పాడి రైతులు అమూల్‌కి పాలు పోసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరో ఏడాదిలో రెట్టింపు పాలసేకరణ జరగనుంది. ఆర్‌బీకేల ద్వారా కూడా పాల సేకరణ చేపడతాం. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతుల లాభార్జనే ప్రభుత్వ లక్ష్యం.

– డాక్టర్ ప్రసాదరావు, జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి

దొంగ ఓట్లతోనే వెలగపూడి గెలుపు

ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు ముకుంద్



మాట్లాడుతున్న ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు

మహారాణిపేట: విశాఖ తూర్పు నియోజకవర్గంలో 40 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో తొలగించాలని ప్రజా ప్రస్థానం పార్టీ అధ్యక్షుడు తోట వెంకట సాయి ముకుంద్ డిమాండ్ చేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు బోగస్ ఓట్లు, రిగ్గింగ్ చేసి గెలుస్తున్నారని.. దొంగ ఓట్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ స్థానికేతులు విశాఖ తూర్పులో ఉన్నట్టు ఓట్లు సృష్టించారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

బొజ్జన్నకొండ వద్ద టూరిస్టులకు మౌలిక సదుపాయాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసపానీ

అనకాపల్లి టౌన్: బొజ్జన్నకొండ సమీపంలో టూరిస్టులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎకరా 40 సెంట్లు సేకరించిందని టూరిస్టు శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసపానీ చెప్పారు. మంగళవారం బొజ్జన్నకొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ బౌద్ధారామానికి బ్రిటిష్ కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రపంచ దేశాల నుంచి కొండను తిలకించేందుకు లక్షలాదిమంది టూరిస్టులు రాకపోకలు సాగిస్తారని, ఇక్కడ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు. ఎకరా 40 సెంట్లలో పార్కింగ్, మరుగుదొడ్లు, రెస్టారెంట్, వసతిగృహాలు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.అశోక్ ఆయన వెంట ఉన్నారు.

ఏసీఏ గేమ్ డెవలపర్‌గా కుమార్



నియామకపత్రాన్ని అందిస్తున్న గోపీనాథరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) గేమ్ డెవలపర్, జీఎంగా ఎంఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ రెడ్డి మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. పూర్వ రంజీ ఆటగాడైన కుమార్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో చక్కటి సేవలందించి ఇటీవలే జీఎం స్పోర్ట్స్‌గా పదవీ విరమణ చేశారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కుమార్‌ను అభినందించింది.

టీడీపీ నిర్లక్ష్యంతోనే బొజ్జన్నకొండ నిధులు వెనక్కు..

- ఆనాడు అనుకూలమైన స్థలం చూపించకపోవడంతోనే ఈ పరిణామం
- పర్యటకాభివృద్ధిపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ
- ఏలేరు కాలువ కోసం సేకరించిన 1.5 ఎకరాల స్థలం బొజ్జన్నకొండకు కేటాయింపు
- అవగాహన, బాధ్యతా రాహిత్యంతోనే టీడీపీ నేతల తప్పుడు వ్యాఖ్యలు
- మీడియాతో ఎంపీ సత్యవతి



సాక్షి, అనకాపల్లి: టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే బొజ్జన్నకొండకు కేంద్ర పర్యాటక శాఖ ఇచ్చిన నిధులు వెనక్కువెళ్లాయని ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి మండిపడ్డారు. ఆనాటి ప్రభుత్వం అనుకూలమైన స్థలం చూపించి ఉంటే ఇలాంటి దుస్థితి ఎదురయ్యేది కాదన్నారు. ఇవేమీ తెలుసుకోకుండా టీడీపీ నేత పీలా గోవింద సత్య నారాయణ బాధ్యతారాహితంగా మా ట్లాడడం సరికాదని ఎంపీ హితవు పలికారు. మంగళవారం అనకాపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పీలా సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశారని.. ఆరోపణ లు చేసేటప్పుడు పూర్వాపరాలు తెలుసుకోవాలని ఆమె అన్నారు. 2019 సంవత్సరం నాటికి బౌద్ధారామం బొజ్జన్నకొండ ఆవరణలో నిర్మాణాలు జరపకూడదని నిబంధనలు ఉండడం.. ఆ తర్వాత కరోనా మహమ్మారి అడ్డుకోవడంతో ముందుకు వెళ్లలేకపోయామన్నారు. బొజ్జన్నకొండ సమీపంలో ఉన్న ఏలేరు కాలువ నిమిత్తం సేకరించిన 1.5 ఎకరాల స్థలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో పర్యాటకశాఖకు బదిలీ చేయడంతో ఈ ప్రాజెక్టుకు మోక్షం లభించిందన్నారు. ఈ పర్యాటక ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రితో మాట్లాడాని, రానున్న బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించనున్నట్లు చెప్పారన్నారు. 'బొజ్జన్నకొండ నుంచి జాతీయ రహదారికి రోడ్డు మీ ప్రభుత్వం వస్తే వేయించేదేమిటి..? ప్రస్తుతం మేమే నిర్మాణపనులు చేపడుతున్నాం కదా' అన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ. 30 లక్షలు మంజూరు చేశామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని, నెల రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు కూడా పూర్తి కానున్నాయన్నారు.

వాస్తవాలు తెలుసుకుంటే మంచిది..

2017లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీం కింద రాష్ట్రంలో ఉన్న బౌద్ధారామాల అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించిందని, వీటిలో బొజ్జన్నకొండకు రూ.7 కోట్ల 30 లక్షలు మంజూరు చేశారని ఎంపీ సత్యవతి చెప్పారు. ఈ స్కీంలో నిధులు మంజూరు చేసినప్పటికీ బౌద్ధారామాలకు 1.5 కి.మీ. దూరం వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆర్కియాలజీ విభాగం వారి నిబంధనలున్నాయని, వాటికి అనుగుణంగా ఉమ్మడి విశాఖలో బొజ్జన్నకొండ, తొట్లకొండ, శ్రీకాకుళం శాలిహుండంకు నిధులు రద్దు చేయడం జరిగిందన్నారు. వీటిని మినహాయించి రాష్ట్రానికి స్వదేశీ స్కీం కింద కేవలం రూ.24 కోట్లు మాత్రమే నిధులు మంజూరు చేశారన్నారు. ఇది తెలియక అవగాహన రాహిత్యంతో టీడీపీ నేతలు మాట్లాడడం తగదన్నారు.

వరుణాస్త్ర..

మేడ్ ఇన్ వైజాగ్

- నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో నిర్మాణం
- ఇటీవల ఈ టార్పెడో ప్రయోగం విజయవంతం
- యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాల నుంచి ప్రయోగించేలా రూపకల్పన
- 50 కి.మీ దూరంలోని టార్గెట్‌ను మట్టు పెట్టగల సామర్థ్యం



వరుణాస్త్ర



సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళానికి అత్యంత శక్తివంతమైన వరుణాస్త్రను అందించిన ఘనతను విశాఖ సొంతం చేసుకుంది. ఇండియన్ నేవీ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి వరుణాస్త్ర టార్పెడోను భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో), భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సహకారంతో ఎన్ఎస్‌టీఎల్ తయారు చేసింది. మూడేళ్ల కిందటే ఈ హెవీ వెయిట్ టార్పెడో (వరుణాస్త్ర) నిర్మాణాన్ని పూర్తి చేసిన ఎన్ఎస్‌టీఎల్.. 2020 నవంబర్‌లో భారత నౌకాదళానికి అప్పగించింది. ఇప్పటికే యుద్ధ నౌక, యుద్ధ విమానం నుంచి విజయవంతంగా వరుణాస్త్ర ప్రయోగాన్ని నిర్వహించిన భారత నౌకాదళం తాజాగా సబ్‌మెరైన్ నుంచి ప్రయోగించి విజయవంతంగా 40 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించింది.

వరుణాస్త్ర.. గొప్ప వరం

ఎన్ఏడీ జంక్షన్ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్‌లో వరుణాస్త్ర తయారైంది. అనేక ట్రయల్స్ తర్వాత వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో.. అన్ని యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించేలా రూపుదిద్దుకుంది. ఈ వరుణాస్త్ర సామర్థ్య లక్షణాలను అంచనా వేసేందుకు డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 130 సాంకేతిక ట్రయల్స్, యూజర్ ట్రయల్స్ నిర్వహించారు. వరుణాస్త్ర హెవీ వెయిట్ టార్పెడో యాంటీ సబ్‌మెరైన్, యాంటీ షిప్ ఆపరేషన్లలో విద్యుత్‌తో నడిచేలా రూపొందించారు. ఇది గరిష్ఠంగా సాగర గర్భంలో 600 మీటర్ల లోతులో గంటకు 70 కిలోమీటర్ల వేగంతో.. 50 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించగలదు. అత్యంత అధునాతన ఆయుధమైన వరుణాస్త్ర భారత్‌కు గొప్ప వరంగా మారింది.

టార్గెట్ మిస్ అవ్వదు

వరుణాస్త్ర సముద్ర గర్భంలో అర కిలోమీటర్ లోతులో ఉన్నప్పటికీ నావిగేషన్ సిస్టమ్‌కు సంకేతాలను అందించగలదు. నీటి అడుగున ఎలాంటి ప్రతికూల వాతావరణంలోనైనా శత్రుదేశాల జలాంతర్గాములను ట్రాక్ చేసి మట్టుపెట్టగలదు.

వరుణాస్త్ర విశేషాలివీ..

ఈ హెవీ వెయిట్ టార్పెడో వరుణాస్త్రను సముద్రంలో దాగి ఉన్న శత్రు దేశపు జలాంతర్గామిపై ప్రయోగించవచ్చు. 95 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైంది. ప్రపంచంలో జీపీఎస్ ఆధారంగా దూసుకుపోయే ఏకైక టార్పెడోగా వారుణాస్త్ర వినుతి కెక్కింది. దీని విశిష్టతల్ని ఓసారి పరిశీలిస్తే..

వరుణాస్త్ర బరువు	1500 కిలోలు
పొడవు	7 నుంచి 8 మీటర్లు
వ్యాసం	533 మిల్లీ మీటర్లు
వార్‌హెడ్ బరువు	250 కిలోలు
ఆపరేషన్ పరిధి	50 కి.మీ
ఎంత లోతులోని సబ్‌మెరైన్‌ని ధ్వంసం చేయగలదు	600 మీటర్లు
నీటిలో ఎంత వేగంతో దూసుకెళ్తుంది	గంటకు 70 కిలోమీటర్లు

వరుణాస్త్రలో ఉన్న వార్‌హెడ్ పేలిపోయే అవకాశాలు చాలా తక్కువ. దీన్ని ఆపరేట్ చేయడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం చాలా సులభంతో పాటు సురక్షితం. అతి తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఈ హెవీవెయిట్ టార్పెడో నేవీ యుద్ధ కార్యాచరణ అవసరాలను తీర్చగలదు. స్వదేశీ పరిజ్ఞానంతోనూ హెవీ వెయిట్ టార్పెడోలు తయారు చేయగల సత్తా భారత్ సాధించిందన్న సంకేతాలను వరుణాస్త్ర ద్వారా ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు.



ఎన్ఎస్‌టీఎల్

కొనసాగుతున్న ఓరియంటేషన్ తరగతులు

మురళీనగర్ (విశాఖ): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ తరగతులు మంగళవారం కొనసాగాయి. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్)లో స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ తరగతులకు రెండో రోజు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే, మండల నాయకులు

గొలుగొండ: రాష్ట్రంలో ఎన్నికల హామీలన్నీ నెరవేర్చడం వల్లే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాదరణ పెరుగుతుందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. మండలంలోని కొత్త ఎల్లవరం పంచాయతీ శివారు గిరిజన గ్రామం కరకలో టీడీపీ నాయకులు నూకరాజు, లోవకుమార్, పెద దేముడుతోపాటు మరికొంత మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఇక్కడ వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందన్నారు. అందుకే పార్టీలో చేరామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు స్థానిక నాయకులు అనిమిరెడ్డి వెంకటరమణ, శ్రీరామమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత



స్వాధీనం చేసుకున్న కలప

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి సామిల్లుకు సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన కలపను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ లక్ష్మీనర్సు తెలిపారు. డీఎఫ్‌వో రాజారావు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి కలపను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనుమతులు లేకుండా 20 ఆకేషియా, 2 టేకు దుంగలు నిల్వ చేశారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.9,308 ఉంటుందన్నారు. కలప నిల్వ చేసిన కోటవురట్ల మండలం, రామచంద్రపురానికి చెందిన పి.రత్నాకర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం ఓ లోడు లారీ బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు మొక్కల లోడుతో వెళ్తుండగా పాములేరు దాటిన తరువాత ఘాట్‌లోని వాలీసుగ్రీవ్ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. లారీ రోడ్డుపైనే అనుకుని బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. ఇరువైపులా రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగలేదు.

రక్త 'సాయానికి' మేమున్నాం!

సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత సమాజంలో మనిషి స్వతహాగా తయారు చేయలేని పదార్థాల్లో రక్తం ఒకటి. ప్రాణాప్రాయ స్థితిలో ఇదెంతో అవసరం.. ఈ పరమార్థాన్ని గుర్తించి విద్యార్థుల ఆలోచనల నుంచి పురుడుపోసుకున్నదే 'సాయానికి రూ.10 సేవా సంస్థ'. మూడేళ్లుగా ఎంతోమంది ప్రాణాలు కాపాడి నిరుపమాన సేవలందిస్తున్న ఆ సంస్థ గురించి నేడు ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా తెలుసుకుందాం..

- ఏఎంఏఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు
- 'సాయానికి రూ.10 సేవా సంస్థ'తో విశేష సేవలు
- 3 ఏళ్లలో 3 వేల యూనిట్ల రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాన దినోత్సవం



రక్తదాన శిబిరంలో విద్యార్థులు (ఫైల్)

తుమ్మపాల: రక్తదానం చేద్దాం.. మరో నలుగురితో రక్తదానం చేయిద్దాం.. అవసరమైన వ్యక్తికి రక్తాన్ని దానం చేయడం అనేది మానవుని నైతిక విలువల్లో ఒకటి. ఒక మాటలో చెప్పాలంటే రక్తదానం.. దైవ సమానం.. అనే స్ఫూర్తితో అనకాపల్లి ఏఎంఏఎల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 'సాయానికి రూ.10 సేవా సంస్థ'ను 2019లో స్థాపించారు. ఇతరుల వద్ద రూ.10 మాత్రమే చందాగా తీసుకుని అనేక సేవా కార్యక్రమాలు చేస్తోంది. ఈ సంస్థలో 600 మంది పైగా విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. మూడేళ్లలో పది రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఇప్పటి వరకు అనారోగ్యం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మూడు వేల యూనిట్ల రక్తదానం చేశారు.

పలు చోట్ల రక్తదాన శిబిరాలు..

గడిచిన మూడేళ్లలో కళాశాల విద్యార్థుల సహకారంతో అనకాపల్లి (ఏఎంఏఎల్ కళాశాలలో) –5, నర్సీపట్నం –1, అడ్డురోడ్డు –1, చోడవరం– 1, రేబాక –2 చొప్పున రక్తదాన శిబిరాలు నిర్వహించి మూడు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

రక్తదానం చేయడం వల్ల ప్రయోజనాలు

రక్తదానం చేయడం వల్ల క్యాన్సర్ రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు క్యాన్సర్లు రాకుండా ఆరోగాన్ని కాపాడుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులను నివారించడానికి రక్తదానం చేయడం చాలా మంచిది. రక్తపోటును నియంత్రించడంలో సహాయ పడుతోంది. సంవత్సరానికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. సన్నగా ఉన్నవారు కాకుండా లావుగా ఉన్నవారే రక్తదానం చేయాలనేవన్నీ అపోహలు మాత్రమే.. 18 నుంచి 60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయవచ్చు.



41 సార్లు రక్తదానం చేశాను

నా పేరు బి. సుప్రజ, నేను ప్రభుత్వ ఉద్యోగిని. రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలోని అనేక మందిని కాపాడుకోగలం. ఆ నమ్మకంతో నేను రక్తదానం చేస్తున్నాను. రక్త రుణగ్రహీత ముఖాల్లో చిరునవ్వు చూడవచ్చు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ప్రయత్నించండి. రక్తదానం చేయడం వల్ల మంచి ఆరోగ్యం పొందుతాం.

రక్తదాతలను పిలుస్తోంది మా సంస్థ



నా సహ విద్యార్థులతో కలిసి సాయానికి రూ.10 సేవా సంస్థను స్థాపించాం. అనారోగ్యం, ప్రాణాపాయ స్థితిలో రోగులను రక్తదాతల సహకారంతో ఆదుకునేందుకు మా సేవా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటోంది. మనం ఇచ్చే రక్తం చాలా పెద్ద మార్పును కలిగిస్తుంది.

– లాలం యోసుబాబు, అధ్యక్షుడు, సాయానికి రూ.10 సేవా సంస్థ

3,520 మందికి స్థానచలనం

- బదిలీలతో ఉపాధ్యాయుల్లో జోష్
- వెబ్ కౌన్సెలింగ్‌పై సర్వత్రా హర్షం
- ఇంట్లో కూర్చొని బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు
- ఎటువంటి పైరవీలు లేకుండానే కోరుకున్న చోటుకు బదిలీ
- ఉమ్మడి విశాఖ జిల్లాలో పూర్తయిన బదిలీలు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలు అంటే అదో ప్రహసనంగా ఉండేది. ఆందోళనలు, ధర్నాలతో విద్యాశాఖాధికారుల తలలకు బొప్పి కట్టేది. ఇది ఒకప్పటి మాట.. నేడా పరిస్థితి లేదు. ఎటువంటి పైరవీలు లేకుండానే ఎంచక్కా ఇంట్లో కూర్చొని కోరుకున్న చోటుకు బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయుల్లో సరి కొత్త జోష్ కనిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో బదిలీల ప్రక్రియ పూర్తయింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు పాత ప్రదేశాల నుంచి రిలీవై కొత్త ప్రదేశాల్లో చేరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని క్యాడర్లు కలుపుకొని 3,520 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినట్లు డీఈఓ కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఇందులో గ్రేడ్ –2హెచ్‌ఎం–150, స్కూల్ అసిస్టెంట్ గణితం– 336, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ – 170, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ–203, స్కూల్ అసిస్టెంట్ సోషల్ –255, స్కూల్ అసిస్టెంట్ తెలుగు– 172, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ –380, హిందీ –93, ఫిజికల్ డైరెక్టర్– 73 మంది ఉపాధ్యా యులకు బదిలీ జరిగింది. అదేవిధంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు 1,688 మందికి బదిలీ అయింది. వెబ్ కౌన్సె లింగ్ పద్ధతిన బదిలీల ప్రక్రియ జరగడంతో ఉపాధ్యాయులు తమ ఇంట్లో కూర్చుని బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా కోరుకున్న చోటకు బదిలీ జరుగడంతో ఉపాధ్యాయుల్లో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. 8 ఏళ్ల సర్వీసు పైబడిన ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండటంతో బదిలీ ఉత్తర్వుల జారీలో జిల్లాలో కాస్త ఆలస్యమైంది.

బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల సమయంలో చేసిన తప్పిదాల కారణంగా, అదేవిధంగా డీఈఓ కార్యాలయం సిబ్బంది సకాలంలో ఖాళీలను చూపించకపోవడం వంటి కారణాలతో జిల్లాలో ఎస్జీటీ క్యాడర్లకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కావడంలో ఆలస్యమైంది. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖ డీఈవో చంద్రకళ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసింది. వెబ్ ఆప్షన్‌లో చోటు చేసుకున్న తప్పిదాల కారణంగా బదిలీ ఉత్తర్వులు అందుకొలేని ఉపాధ్యాయులకు సైతం మేలు చేసేలా విద్యాశాఖ ఉన్నతాధికా రులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలాంటివారు డీఈఓ కార్యాలయంలో సంప్రదిస్తే అందుబాటులో ఉన్న ఖాళీలు మేరకు వారికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేలా పరిశీలిస్తున్నారు.

యలమంచిలి డిగ్రీ కళాశాలకు నాక్ - ఏ గ్రేడ్



మే నెలలో యలమంచిలి డిగ్రీ కాలేజీలో పర్యటించిన నాక్ బృందం సభ్యులు(ఫైల్)



ఎమ్మెల్యే కన్నబాబురాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న అధ్యాపక బృందం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో కళాశాలకు పునరుజ్జీవం
- అధ్యాపక బృందానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు అభినందన

యలమంచిలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వ యూజీసీ ఆధీనంలోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) ఏ గ్రేడ్ లభించింది. దేశవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, విద్యార్థులు అధ్యాపకుల భాగస్వామ్యం, పాఠ్య ప్రణాళికల అమలు, మౌలిక వసతులు, యాజమాన్య నిర్వహణ తదితర అంశాలు పరిశీలించిన యూజీసీ కమిటీ నాక్ గ్రేడ్‌లకు ఎంపిక చేస్తుంది. ఈ మేరకు గత మే నెలలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బీహార్‌లో పూర్ణియా యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ డా.రాజ్‌నాథ్ యాదవ్ చైర్మన్‌గా జమ్ము, బెంగళూరు రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాల అధ్యాపక బృందం సమగ్రంగా పరిశీలించింది. ఈ నివేదికను నాక్ సంస్థకు అందజేయగా ఈ ఎంపికల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ పొందిందని, రాష్ట్రంలో ఐదు డిగ్రీ కళాశాలలకే ఈ గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. గతంలోనూ కళాశాల నాక్‌కు ఎంపికయిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కళాశాలలో మౌలిక వసతులతోపాటు చక్కటి విద్యను అందించగలుగుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో కళాశాల అభివృద్ధి చెందిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం సభ్యులను ఎమ్మెల్యే కన్నబాబురాజు అభినందించారు. కళాశాల అభివృద్ధికి మరింత తోడ్పాటు నందిస్తానని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు.

160 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న 160 మంది జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రతిపాదనల్ని ఆమోదిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 280 మంది దరఖాస్తు చేసుకోగా.. వాటిలో 120 మంది సరిగ్గా దరఖాస్తు చేసుకోలేదన్నారు.

వారు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని సదరు దరఖాస్తులను జిల్లా పౌర సంబంధాల కార్యాలయానికి అందజేయాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఆయన చాంబర్‌లో అక్రిడిటేషన్ కమిటీ మంగళవారం తొలిసారి సమావేశమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సభ్యుల సలహాలు, సూచనల మేరకు త్వరలో అక్రిడిటేడ్ జర్నలిస్టులకు వైద్య శిబిరాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్‌ను ఆదేశించారు. ప్రధాన పత్రికలు మినహా ఇతర పేపర్‌లో విధులు నిర్వహిస్తున్న నిరుపేద రిపోర్టర్లకు జర్నలిస్టుల హెల్త్‌స్కీమ్‌కు అవసరమైన చలానా నగదు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యుడు, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ బి.ఎస్.వి.లోవరాజు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందించి హెల్త్ స్కీమ్ చలనాల్ని సీఎస్సార్ నిధుల నుంచి చెల్లించేందుకు అంగీకరించారు. స్పెషలిస్టు వైద్యులను ఇక్కడకు తీసుకొచ్చి హెల్త్ క్యాంప్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులకు ఉమ్మడి విశాఖ జిల్లా మొత్తం ఆర్టీసీ పాస్ చెల్లుబాటు అయ్యేలా చూడాలని కమిటీ సభ్యులు కోరగా.. ఇప్పటికే దానికి సంబంధించిన సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బంగారు లోవరాజు, కె.చంద్రరావు, కె.చంద్రశేఖర్, ఎస్.కె. చాంద్ బాషా, టి.రమేష్, కన్వీనర్ అండ్ మెంబరు కె.ఇంద్రవతి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ కె.వి.వి.ఎస్.ఎన్ రాజేష్ ,కార్మిక శాఖ అధికారి మునిస్వామి, రైల్వే అధికారి బి.వి రావు, హౌసింగ్ అధికారి కూర్మనాయుడు, ఆర్టీసీ అసిస్టెంట మేనేజర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల స్టంట్ కోసమే అన్నా క్యాంటీన్

అయ్యన్నపై ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ధ్వజం



నర్సీపట్నం: ఎన్నికల స్టంట్‌లో భాగంగానే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నా క్యాంటీన్ ప్రారంభించారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. ఇదే విధంగా 2014 ఎన్నికల మేనిఫెస్టోలో రూపాయికే టిఫిన్, ఐదు రూపాయలకే భోజనం పెడతామని చెప్పడంతో ప్రజలు నమ్మి టీడీపీకి పట్టం కట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు అన్నా క్యాంటీన్లు పెట్టి పేదలను మోసం చేయాలని చూస్తే అయ్యన్నపాత్రుడు, చంద్రబాబులకు గుణపాఠం చెప్పారన్నారు. మళ్లీ ఏడాదిలో ఎన్నికలు వస్తుండడంతో ఎన్నికల స్టంట్ కోసం అన్నా క్యాంటీన్ ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి జిమ్మిక్కులు ఎన్ని చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలతో కడుపునిండా మూడు పూటలు తింటున్నారన్నారు. మరో 30 ఏళ్లపాటు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అన్న విషయాన్ని అయ్యన్నపాత్రుడు గుర్తు పెట్టుకోవాలని స్పష్టం చేశారు.

స్కిల్ హబ్‌లో కుట్టు శిక్షణకు గుర్తింపు ఉంది

జాతీయ కుట్టు మిషన్ దినోత్సవంలో ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

చోడవరం రూరల్ : జాతీయ నైపుణ్య కేంద్రం ద్వారా గుర్తింపు పొందిన కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఇచ్చే ధ్రువపత్రాలకు విలువ ఉంటుందని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు అన్నారు. మంగళవారం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జాతీయ సేవా పథకం మూడు విభాగాల ఆధ్వర్యంలో జాతీయ కుట్టు మిషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చోడవరం పరిసర గ్రామాల్లోని మహిళలకు 90 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శిక్షణానంతర ధ్రువపత్రాలను జారీ చేస్తుందన్నారు. ఇప్పటికే 45 మందికి శిక్షణ పూర్తి చేసి ధ్రువపత్రాలను అందచేసినట్టు ఆయన తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి బ్రాండిక్స్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని, ఈ మేరకు ఆ కంపెనీ స్కిల్ హబ్ ఒప్పందం ఉందని చెప్పారు. శిక్షణకు 35 కుట్టుమిషన్లు, నైపుణ్యం కలిగిన శిక్షకురాలు అందుబాటులో ఉన్నట్టు వివరించారు. కుట్టు శిక్షణ ట్రైనర్, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల పీవోలు డి.మాల్యాద్రి, బి.లక్ష్మి, పి.పిచ్చమ్మ, ఉపన్యాసకులు, స్కిల్ హబ్ మెంటార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి : జడ్డంగి–చెరకుంపాలెం మధ్య మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అమీనాబాద్‌కాలనీకి చెందిన తండ్రి, కుమారుడు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలివి. మేలేటి సీతారాంబాబు (44), దుర్గాప్రసాద్ (24) ఏలేశ్వరం నుంచి మోటారు బైక్‌పై స్వగ్రామం వస్తున్నారు. ఇంతలో జడ్డంగి నుంచి చెరకుంపాలెం వైపు వెళుతున్న ట్రాక్టర్ మోటారు బైక్‌ను ఢీ కొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న తండ్రి కొడుకులకు తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలిసిన సర్పంచ్ దాసరి నాగేశ్వర్రావు సంఘటన స్థలానికి వెళ్లి, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను ఆటోలో జడ్డంగి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు.

అయ్యన్న, అనిత కళ్లున్న కబోదులు

రాష్ట్రంలో అభివృద్ధి కనిపించదా? : వీసం



మాట్లాడుతున్న వీసం రామకృష్ణ తదితరులు

నక్కపల్లి: మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితలు కళ్లున్న కబోదులని, రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వారికి కనిపించడం లేదని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ విమర్శించారు. మంగళవారం ఆయన నక్కపల్లి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కేవలం చంద్రబాబు మెప్పుకోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైన చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీలో అసమ్మతి పోరును ఎదుర్కోలేక ఫ్రస్ట్రేషన్‌లో ప్రభుత్వంపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల ముందు నక్కపల్లిలో డిగ్రీ కళాశాల, ఆస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతామని మోసపూరిత వాగ్దానాలు చేసిన అనిత ఐదేళ్ల కాలంలో రెండు పనులు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే ఈ రెండు చేసి చూపించామన్నారు. పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించామన్నారు. ఇంటింటికీ తాగునీటిని అందించే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఉద్దండపురం వద్ద వాటర్ గ్రిడ్ సైతం వైఎస్ హయాంలోనే బీజం పడిందన్నారు. వాస్తవాలను పక్కన పెట్టి తమ ప్రభుత్వంపై కావాలని బురద జల్లితే సహించేది లేదన్నారు. దమ్ముంటే గత పాలనలో, ఇప్పటి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, నాయకుడు కొల్నాటి తాతాజీ పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో అమ్మకానికి వరి విత్తనాలు

వాతావరణ ఆధారిత వ్యవసాయంపై రేపు సదస్సు



సుజాత వరి రకం విత్తనం

అనకాపల్లిటౌన్ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జీఎల్–2537), మార్టేరు సాంబ(ఎంటీయూ–1224), సుజాత(ఎంటీయూ–1210) విత్తనాలు ఉత్పత్తి చేసినట్టు తెలిపారు. విత్తనాల ఖరీదు 30 కేజీల బస్తా ఒక్కొంటికి రూ.1050లుగా పేర్కొన్నారు. శ్రీకాకుళం సన్నాలు పంట కాలం 155–160 రోజులని, సన్నగింజ రకము ఉల్లికోడు, అగ్గితెగులు తట్టుకోగలదన్నారు. ముదురు నారు 5–6 హెక్టార్లకు వస్తుందన్నారు. మార్టేరు సాంబ పంట కాలం 135–140 రోజులని, గింజ సన్నగా బీపీటీని పోలి ఉంటుందన్నారు. నారు దిగుబడి 6 నుంచి 7 హెక్టార్లకు సరిపోతుందన్నారు. అగ్గి తెగులును పూర్తిగా, దోమను పాక్షికంగా తట్టుకోవడంతోపాటు గింజ రాలదని తెలిపారు. సుజాత పంట కాలం 125 రోజులని, గింజ మధ్యస్థంగా ఉంది, నారు దిగుబడి 6–7 ఎకరాలకు వస్తుందన్నారు. అగ్గి తెగులును, ఎండాకు తెగులును తట్టుకుంటుందన్నారు. ఎకరంలోపు ఉన్న ప్రతీ రైతుకి ఒక బస్తా చొప్పున(30 కేజీలు), ఎకరం దాటిన కమతాలున్న రైతులకు కమత విస్తీర్ణాన్ని బట్టి 2 లేదా 3 బస్తాలు చొప్పున అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, నాణ్యమైన విత్తనాలను పొందాల్సిందిగా కోరారు. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఈ నెల 15 ఉదయం 10 గంటలకు రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా వీరయ్య



యలమంచిలి: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా డీఈ వీరయ్య నియమితులయ్యారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి ఇటీవల బదిలీపై పిఠాపురం మున్సిపాలిటీకి వెళ్లగా, ఇక్కడ డీఈగా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అధికారి వీరయ్యకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలతో ఉన్నతాధికారుల నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన తెలిపారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సమక్షంలో బాధ్యతలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

వైఎంవీఏ హాల్లో రక్తదాన శిబిరం నేడు



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కోరిబిల్లి పరి

అనకాపల్లిటౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో వైఎంవీఏ హాల్లో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేజనా ఐక్యవేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ కోరిబిల్లి పరి తెలిపారు. స్థానిక విజయరెసిడెన్సీ ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రక్తదాన శిబిరం బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. 18 నుంచి 60 సంవత్సరాలు వయసున్న ఆరోగ్యవంతులైన వ్యక్తులు రక్తదానం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు కాండ్రేగుల చందు, వేగి త్రినాథ్, కృష్ణ, పెంటకోట ప్రసాద్, శ్రీరామ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

8 మందికి కంటి శస్త్రచికిత్సలు



ఐవోఎల్ కంటి ఆపరేషన్ జరిగిన రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్ : గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వైద్యురాలు పి.దేవి తెలిపారు. రోటరీ ఫౌండేషన్, వర్తక సంఘం ప్రసూతి ఆస్పత్రి సహకారంతో సోమవారం 24 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా 8 మందిని ఐవోఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వీరిని మూడు రోజులు ఆస్పత్రి పర్యవేక్షణలో ఉంచి, ఉచితంగా మందులు, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్, వైద్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరి

కశింకోట : మండల ప్రజలు మంగళవారం వేసవి తాపంతో ఇబ్బంది పడ్డారు. గత కొన్ని రోజులుగా ఎండలు భరించలేకున్నామంటూ వాపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు తీవ్ర వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరయ్యారు. చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పిల్లలు, వృద్ధులు ఇక్కట్లకు గురయ్యారు.

పాఠశాలలకు జేవీకే కిట్ల పంపిణీ పూర్తి



కశింకోట బాలికల హైస్కూల్లో జేవీకే స్టాక్ పాయింట్

కశింకోట : మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్ల పంపిణీ మంగళవారం పూర్తి చేసినట్లు ఎంఈవో కె.చిట్టిబాబు తెలిపారు. స్థానిక బాలికల హైస్కూల్లో ఉన్న స్టాక్ పాయింట్ నుంచి జేవీకే కిట్లగా ఇవ్వనున్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు తదితర వాటిని వ్యాన్లు, ఆటోల ద్వారా ఆయా పాఠశాలలకు పంపించామన్నారు. దీంతో పాఠశాలల వారీగా విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ పూర్తి చేసినట్టయిందని వెల్లడించారు.

రైల్వే స్టేషన్ వద్ద గొడవ ఒకరికి గాయాలు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో మంగళవారం రైల్వే సైకిల్‌స్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికునికి, స్టేషన్ టికెట్స్ బుకింగ్ కౌంటర్ క్లర్కుకి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో సైకిల్ స్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి స్వల్పగాయాలు తగలడంతో స్థానిక వైద్యాలయంలో చికిత్స అందించారు. దీనిపై రైల్వే పోలీసులను వివరణ కోరగా తమ ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

విత్తనాల ఎంపికే కీలకం

వ్యవసాయ సాగులో విత్తన ఎంపిక కీలకం. రైతు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోరాదు. అందుకే సీఎం జగన్ నేతృత్వంలోని రైతు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అందిస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా మేలైన విత్తనాలు ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- ఆర్బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు





వరి పంట(ఫైల్) (ఇన్‌సెట్) ఆర్బీకేలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

అనకాపల్లి రూరల్ : వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఈ ప్రక్రియే రైతు దశ, దిశను మార్చుతుంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి. విత్తన కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకపోతే కొందరు వ్యాపారులు నాణ్యత లేని విత్తనాలు అంటగట్టే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు 17 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే పంట ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు.

నాణ్యత గుర్తింపు ఇలా..

విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి మళ్లీ విత్తనాలుగా వినియోగించవచ్చు. దీని వల్ల రైతులకు విత్తన భారం తగ్గుతుంది. బ్రీడర్ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధనా స్థానాలు, యూనివర్సిటీలు, విత్తన కంపెనీలు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్‌సీడ్(విత్తనం)కు బంగారం రంగు ట్యాగ్ ఉంటుంది. ఈ విత్తనాల ధర కాస్త ఎక్కువ. దుకాణాల్లో విరివిగా లభ్యం కావు. బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్‌ను ఉత్పత్తి చేస్తారు. వివిధ ఉత్పత్తి సంస్థలు సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో వీటిని పండిస్తారు. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది. ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్‌గా వ్యవహరించి, దీనికి నీలం రంగు ట్యాగ్ వేస్తారు. సర్టిఫైడ్‌సీడ్ నుంచి వచ్చే విత్తనాలను ట్రూత్‌లేబుల్ విత్తనాలుగా వ్యవహరించి వీటికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయశాఖనుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకూ జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. బిల్లుపై విక్రయదారుని పేరు, రాష్ట్ర అమ్మకం పన్ను నెంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నెంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు(విడి) విత్తనాలను కొనుగోలు చేయరాదు. గడువు దాటిన విత్తనాల జోలికి అసలు వెళ్లకూడదు. విక్రయదారులిచ్చే కరపత్రాలు తీసుకుని, వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే వాటిని పరీక్షించి మొలకశాతం పరిశీలించాలి. మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

నకిలీ కట్టడికి ప్రభుత్వం చర్యలు

నకిలీ విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, కలెక్టర్లు, వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీస్ అధికారులు విత్తనాలు విక్రయించే దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నాణ్యత లేని, నకిలీ విత్తనాలను అరికట్టే చర్యల్లో భాగంగా ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తోంది. ధర తక్కువని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి, మోసపోకుండా రైతుల్లో అవగాహన పెంచుతోంది.

రశీదు భద్రం



విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కొనుగోలు చేసిన ప్యాకెట్లలో విత్తనాలు ఎంత శాతం మొలకెత్తాయో ముందుగానే చూసుకోవాలి. రశీదు తప్పకుండా తీసుకుని దానిని సీజన్ ముగిసే వరకూ భద్రపర్చుకోవాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఆర్బీకేల్లో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– పీయూబీపీ రంగాచారి, వ్యవసాయాధికారి, అనకాపల్లి

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి



రక్తనిధి కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందన్న ఆశతో వచ్చే బడుగు, బలహీన వర్గాల రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి సూచించారు. మంగళవారం ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాలయంలో అత్యంత ఆధునిక, ఖరీదైన పరికరాలు రోగుల సేవలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరికరాల ద్వారా 250 రకాలైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం వైద్యులు రాసే మందులు వైద్యాలయంలోనే ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో రక్తదాతలు తక్కువగా ఉంటారని, అత్యవసర సమయంలో ఆస్పత్రి రోగులకు రక్తం అందించాకే, బయటి రోగులకు ప్రాధాన్యతివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఆర్ఎంవో లక్ష్మణశ్రీనివాస్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మునూరు శ్రీనివాసరావు, ఎ.వి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగసిద్ధి ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ట నేడు

కశింకోట : స్థానిక కస్పావీధిలో నూతనంగా నిర్మించిన యోగసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట బుధవారం ఉదయం 9.30 గంటలకు జరగనుందని యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి వెంకటాచార్యులు తెలిపారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని సమకూర్చారన్నారు. ఆయన పర్యవేక్షణలో వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ట కార్యక్రమం జరగనుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే విపక్షాల విమర్శలు

- సీఎం జగన్ ఎక్కడికి వెళ్లినా ప్రజల బ్రహ్మరథం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



అవ్వతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలోని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో భీమునిగుమ్మం, మళ్లవీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. పలు ప్రాంతాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో అక్కడే ఉన్న అధికారుల్ని ఆదేశించి, సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి జగన్ ప్రభుత్వంపై ఎన్ని కుట్రలు పన్నినా, ప్రజల దీవెన, దేవుని ఆశీస్సులు తనకున్నాయన్న ధైర్యంతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అవినీతిరహిత పాలన అందిస్తున్న తమ ప్రభుత్వాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తుండటాన్ని సహించలేని ప్రతిపక్షాలు, అవాస్తవ ఆరోపణలు, అర్థరహిత విమర్శలకు దిగుతున్నాయని మండి పడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, పేదలపట్ల సీఎంకు ఉన్న మమకారమే ప్రజల్లో తమ పార్టీకి ఉన్న బలమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు ఎస్.కనకారావు, బెల్లాన అనురాధ, కందలాడ సాయి, బంగారి చంటి, కటారి మహేష్, కొణతాల సత్తిబాబు, దొడ్డి హేమంత్, మళ్ల వెంకట రామారావు, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల, వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో సూచన



బయ్యవరంలో సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట : ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందించి, వారి మన్ననలు పొందాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని బయ్యవరం సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల గౌరవంగా మెలగి, వారి సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. రికార్డుల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, ఎరువుల్ని తయారు చేసి విక్రయిస్తే పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. స్థానిక జాతీయ రహదారి పక్కన ఉన్న చెరువును పరిశీలించి దాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో కశింకోట పంచాయతీ కార్యదర్శి ఎన్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

82వ వార్డులో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : 82వ వార్డు పరిధిలోని శారదాకాలనీ, పరశురాంపేటలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కొండుపాలెంలో ఏపీజీవీబీ గ్రామ సభ



గ్రామసభలో మాట్లాడుతున్న మదన్‌రాజేష్

తుమ్మపాల : గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అనకాపల్లి శాఖ బ్యాంక్ మేనేజర్ మదన్ రాజేష్ తెలిపారు. మండలంలోని కొండుపాలెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో వైఎస్సార్ ఆసరా పథకం నగదును స్థానిక లబ్ధిదారులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్, రుణ పథకాలు, బీమా తదితర సేవలను గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో ప్రజల వద్దకే బ్యాంకుమిత్ర ద్వారా సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొండా అప్పలరాజు, ఉపసర్పంచ్ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గనిరెడ్డి శ్రీరాములు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ



శిక్షణపొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : బడుగు, బలహీన వర్గాల మహిళలకు ప్రభుత్వంతోపాటు, ప్రైవేట్ ట్రస్ట్‌ల ద్వారా వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జోనల్ కమిషనర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు 40 రోజులుగా చేపట్టిన ఉచిత కుట్టుమిషన్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొంది, కుటుంబానికి ఆసరాగా నిలవాలని కోరారు. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వం బ్యాంక్‌ల ద్వారా రుణ సౌకర్యం అందిస్తుందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ మహిళా ఇన్‌చార్జి కె.అమ్మాజీ, ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు



తాళ్లపాలెం హైస్కూల్లో జగనన్న విద్యా కానుక అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



నరసింగబిల్లి హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేత

- జగనన్న విద్యా కానుక పంపిణీలో నాయకులు

కశింకోట : రాష్ట్ర విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని స్థాయిలో విద్యాభివృద్ధికి భారీగా నిధులు వెచ్చిస్తున్నారని కొనియాడారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్‌తో ఆంగ్ల మాధ్యమం, విద్యార్థులకు ఉచితంగా జగనన్న విద్యా కానుక పేరిట చదువుకు అవసరమైన సామగ్రి, అమ్మ ఒడి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్లో కూడా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు మజ్జి ప్రసాదరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కోన వీరవెంకట సత్యనారాయణ, స్కూల్ కమిటీ అధ్యక్షురాలు సేనాపతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఫలితాలే నిదర్శనమని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్దహైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ మనబడి నాడు-నేడులో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని కొనియాడారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, యూనిఫాం, బూట్లు, సాక్సులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జె.సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, బుద్ధ భాస్కరరావు, గొర్లె చిన్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- నాడు-నేడు పనుల పరిశీలనలో ఎంపీడీవో



తుమ్మపాల హైస్కూల్‌లో నాడు నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరసింహారావు, ఈవోపీఆర్డీ

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన బడి నాడు-నేడు పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో కేవీ నరసింహారావు అధికారులను సూచించారు. మంగళవారం ఆయన అనకాపల్లి మండలం తుమ్మపాల జెడ్పీ హైస్కూల్లో నాడు-నేడులో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలని హెచ్ఎంకు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. పంపిణీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల అభ్యసనలో తొలి ఆరేళ్లు కీలకం



వేల్పులవీధి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో ప్రభావతి

అనకాపల్లిటౌన్ : పిల్లల జీవితంలో మొదటి ఆరేళ్లు అత్యంత విలువైనవని, ఆ దశలోనే వారిలో నైపుణ్యాలను వెలికితీయవచ్చని సీడీపీవో కె.ప్రభావతి తెలిపారు. స్థానిక వేల్పులవీధి అంగన్‌వాడీ ఎలిమెంటరీ పాఠశాల నుంచి నెహ్రూచౌక్ వరకు జన్‌భాగీదారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఇష్టమైన ఆటపాటలు, కథల ద్వారా వారి మనస్సుకు హత్తుకునేలా అంగన్‌వాడీకేంద్రాలు అందించాలని సూచించారు. బాల్యదశలో కలిగించే ప్రేరణే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో డెవలప్‌మెంట్ కార్నర్స్ ద్వారా డిపార్టుమెంటు సరఫరా చేసిన ప్రీస్కూల్ కిట్‌తో పిల్లల సమగ్రాభివృద్ధికి ఎలా దోహదపడుతుందో తెలియజేయాలన్నారు. పీపీ 1, పీపీ 2 వర్క్‌బుక్స్, యాక్టివిటీ బుక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల సూపర్‌వైజర్ నిర్మలాకుమారి, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు కె.ఉమ, ఎస్.శ్రీలక్ష్మి, 7వ వార్డు సచివాలయ కన్వీనర్ ఉగ్గిన అప్పారావు, అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో కప్పోత్సవం



కప్పోత్సవంలో గ్రామస్తుల కేరింతలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో వరుణుడి కటాక్షం కోసం మంగళవారం కప్పోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, యువకులు, ప్రజలు కప్పను వస్త్రంలో ఉంచి, దాన్ని కర్రకు కట్టి మోసుకుంటూ వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న గంగదేవి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్ని లక్ష్మి, నారాయణ , ఘంటసాల, పొన్నం శ్రీరాములు, ముత్తా నాగేశ్వరరావు, చిన్ని నాయుడు, చిన్ని బుజ్జి, రెడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అనకాపల్లిటౌన్ : విద్యుత్ వైర్ల కింది భాగంలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం డీ1 సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) కె.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లవీధి, వేల్పులవీధి, ఉడ్‌పేట, నర్సింగరావుపేట, చవితినవీధి, చోడవరం మెయిన్‌రోడ్డు, ఫైర్‌స్టేషన్ రహదారి, జీవీ కోటేశ్వరరావువీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.